తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice
వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

07-07-2026

మంగళవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 149

PUBLISHED FROM HYDERABAD   పేజీలు-8   వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice
వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575




## హమాలీలకు అండగా బీఆర్ఎస్

- హమాలీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- రైతుల సమస్యలపై ప్రభుత్వంపై విమర్శలు
- మల్లాపూర్‌లో హమాలీ యూనియన్ మహాసభలో కేటీఆర్ వ్యాఖ్యలు

2



# అన్నదాత అయోమయం!

- తెలంగాణలో వ్యవసాయం ముందుకు సాగేనా?
- ముఖం చాటేసిన రుతుపవనాలు
- నెర్రెలు వారుతున్న చేన్లు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత
- ఎండిపోతున్న నారుమళ్లు
- రాష్ట్రంలో 1.32 కోట్ల ఎకరాల లక్ష్యం నెరవేరేనా ?

**తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్:**

తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్ (వానకాలం) సాగు ప్రశ్నార్థకంగా మారింది. జూన్ ప్రారంభంలోనే రుతుపవనాలు ప్రవేశిస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలు పూర్తిగా తలకిందులయ్యాయి. జూన్ నెల ముగిసి, జూలై మొదటి వారం దాటుతున్నా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 45 శాతం పైగా వర్షపాత లోటు నమోదైంది. పత్తి, మక్కజొన్న, సోయాబీన్ గింజలు నాటిన రైతులు వానల్లేక మొలకలు రాక అల్లాడుతుండగా.. వరి నారుమళ్లు పోసిన రైతులు నీరు లేక అవి ముదిరిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ వ్యవసాయ రథం అసలు ముందుకు సాగేనా అనే అనుమానాలు క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన వ్యవసాయ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద పత్తి మార్కెట్ ఉన్న వరంగల్, అలాగే ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో తొలి జల్లులకే విత్తనాలు వేసిన రైతులు నష్టపోయారు. ఎండల తీవ్రతకు విత్తనాలు భూమిలోనే మాడిపోవడంతో మళ్లీ రెండోసారి విత్తనాలు వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్, జూరాల వంటి ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు డెడ్ స్టోరేజీకి చేరువలో ఉన్నాయి. కాల్వల ద్వారా సాగునీరు వచ్చే అవకాశం లేకపోవడంతో

మిగతా 2వ పేజీలో..



## గవర్నర్‌ను కలిసిన టెలిమెడిసిన్ సొసైటీ ప్రతినిధులు

- టెలిమెడిసిన్ సేవల విస్తరణపై చర్చ
- గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన వైద్యం అందించడంపై దృష్టి

3



## బిల్లింగ్ ప్రక్రియలో ఖచ్చితత్వం పెంచాలి..

- విద్యుత్ వ్యవస్థను మరింత సమర్థవంతం చేయాలి
- జూబ్లీహిల్స్‌లో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆకస్మిక తనిఖీ

3

## బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత

ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి: కేటీఆర్

తెలంగాణ భవన్‌లో మహనీయుడికి ఘన నివాళి

2



## రూ.300 కోట్ల అక్రమాస్తుల కేసు..

డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్ట్

నాలుగు రోజుల తర్వాత అదుపులోకి తీసుకున్న ఏసీబీ

నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు

కస్టడీ కోరే అవకాశంపై చర్చ

**హైదరాబాద్, జూలై 6, సిరి న్యూస్:**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడైన డీఎస్పీ భీమ్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఇటీవల ఆయనకు చెందిన పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన ఏసీబీ, సుమారు రూ.300 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించిన నేపథ్యంలో విచారణను మరింత వేగవంతం చేసింది.

మిగతా 3వ పేజీలో..

## కాళేశ్వరంపై బీఆర్ఎస్‌కు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది: పొంగులేటి

- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వాలని సవాల్
- పేదల ఇళ్ల నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి
- అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీ

**సిద్దిపేట, జూలై 5, సిరి న్యూస్:**

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను తీవ్రంగా

మిగతా 3వ పేజీలో..



## ప్రభుత్వ విప్‌లకు ప్రత్యేక కార్యాలయాలు

- శాసనసభ ప్రాంగణంలో ప్రారంభించిన మంత్రులు
- ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతలు నిర్వర్తించాలని సూచన
- ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సమన్వయ పాత్రపై దృష్టి

3





## ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్‌లో కీలక మార్పులు

- ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్ష
- ల్యాబ్ మాన్యువల్స్ విడుదల చేసిన ఇంటర్ బోర్డు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**హైదరాబాద్, జులై 6, సిరి న్యూస్:**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షల విధానంలో కీలక మార్పులు చేసింది. కొత్త విధానం ప్రకారం ఇకపై ఇంటర్ ప్రథమ సంవత్సరం సైన్స్

మిగతా 2వ పేజీలో..

రూ.70 వేల లంచం తీసుకుంటూ

## చిక్కిన తహసీల్దార్

- చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను పట్టుకున్న ఏసీబీ
- భూ వినియోగ మార్పిడి అనుమతులకు లంచం డిమాండ్

2





## ట్రాన్స్‌ప్లాంట్ సేవలకు టిమ్స్ సిద్ధం

అవయవ మార్పిడి కేంద్రంగా టిమ్స్ అభివృద్ధి

అత్యాధునిక వైద్య సదుపాయాలను పరిశీలించిన మంత్రి

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అత్యున్నత వైద్య సేవలే లక్ష్యం

**హైదరాబాద్, జులై 6, సిరి న్యూస్:**

సనత్‌నగర్‌లోని తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (టిమ్స్)ను అన్ని రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం

మిగతా 2వ పేజీలో..

## ప్రైవేటీకరణ దిశగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్?!

- రూ.225 కోట్ల టెండర్లతో ఉద్యోగుల భగ్గుమన్న నిరసన
- సంస్థ నిర్వహిస్తే రూ.60 కోట్ల ఆదా.. అయినా ప్రైవేటుకే ఎందుకో?
- ప్రభుత్వ మొండి వైఖరిపై నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ జెన్కోకు ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా మారుతున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వేదికగా ఇప్పుడు విద్యుత్ ఉద్యోగులు, ప్రభుత్వం మధ్య పోరు ముదిరింది. పవర్ ప్లాంట్‌లోని కీలకమైన యాష్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల

మిగతా 3వ పేజీలో..



## వివాహేతర సంబంధమే భర్త హత్యకు కారణం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే హత్య చేసినట్లు వెల్లడి

2



# బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

**హైదరాబాద్, జులై 6, సిరి న్యూస్:**
మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేతగా ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కేటీఆర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ దేశ చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న నాయకుడని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన చూపిన మార్గం ఆదర్శనీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు కేంద్ర మంత్రిగా, ఉపప్రధానిగా ప్రజా సంక్షేమానికి విశేష సేవలు అందించారని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందితేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందనే సందేశాన్ని బాబు జగ్జీవన్‌రామ్ తన జీవితంతో చాటిచెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలను ఆచరిస్తూ ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# హమాలీలకు అండగా బీఆర్ఎస్

**హైదరాబాద్, జులై 6, సిరి న్యూస్:**
హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభలో పాల్గొన్న ఆయన, హమాలీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హమాలీల కూలీ రేట్లను గణనీయంగా పెంచామని కేటీఆర్ గుర్తు చేశారు. బస్తాకు రూ.8గా ఉన్న కూలీని రూ.26కు పెంచడంతో పాటు, ఐదేళ్లకోసారి కాకుండా రెండేళ్లకోసారి కూలీ రేట్ల సవరణ చేపట్టి కార్మికులకు ప్రయోజనం కల్పించామని చెప్పారు. హమాలీలకు ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలు కూడా అమలు చేశామని పేర్కొన్నారు.రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించిన కేటీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రైతులకు నీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, మద్దతు ధర, బోనస్ వంటి అంశాల్లో ప్రభుత్వం స్పందించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. రైతులు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. హమాలీలు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.







# వివాహేతర సంబంధమే భర్త హత్యకు కారణం

- **భార్యతో కలిసి ఇద్దరు సహచరుల అరెస్ట్**
- **ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే హత్య చేసినట్లు వెల్లడి**
- **ప్రశాంత్ హత్య కేసును ఛేదించిన పోలీసులు**

**నిజామాబాద్, జులై 6, సిరి న్యూస్:**
నిజామాబాద్ జిల్లాలో సంచలనం రేపిన ప్రశాంత్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భార్య సంధ్య తన సహచరులు అనిల్, వెంకట సాయి అలియాస్ బంటితో కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల దర్యాప్తు ప్రకారం, సంధ్యకు ఉన్న వివాహేతర సంబంధాన్ని ప్రశాంత్ తీవ్రంగా వ్యతిరేకించడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో అతడిని అడ్డుతొలగించాలని ముందుగానే పథకం రచించి హత్యకు కుట్ర పన్నినట్లు విచారణలో తేలిందని తెలిపారు.

మొదటి దాడి తర్వాత ప్రశాంత్ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరగా, అక్కడ కూడా నిందితులు తమ కుట్రను అమలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. చికిత్స పొందుతున్న సమయంలో టాయిలెట్ క్లీనర్ ద్రావణాన్ని ఇంజెక్ట్ చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో బయటపడిందని పేర్కొన్నారు.

సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాలు, విచారణలో లభించిన వివరాల ఆధారంగా సంధ్యతో పాటు అనిల్, వెంకట సాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ముగ్గురిపై హత్యతో పాటు ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించగా, ఘటనకు సంబంధించిన ఇతర కోణాల్లో కూడా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## ప్రైవేటీకరణ దిశగా
# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్?!

**మొదటిపేజీ తరువాయి**
నిర్వహణను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన టెండర్ల ప్రక్రియపై ఉద్యోగ సంఘాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా, జెన్కో ఆధ్వర్యంలో పటిష్టంగా నడుస్తున్న పనులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మార్చడం వెనుక పెద్ద కుట్ర దాగుందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

**రూ. 225 కోట్ల టెండర్..**
**సంస్థకు రూ.60 కోట్ల నష్టం**
నల్గొండ జిల్లా దామరచర్లలోని వీర్లపాలెంలో 2,800 ఎకరాల్లో విస్తరించిన ఈ భారీ ప్రాజెక్టు 2,400 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మితమైంది. ఇప్పటికే ఒక యూనిట్ ద్వారా 800 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. ఇంతటి కీలక పవర్ ప్లాంట్‌లో, ఇప్పటివరకు జెన్కో అధికారుల పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా జరుగుతున్న యాష్, కోల్ హ్యాండ్లింగ్ పనులను.. మూడేళ్ల కాలానికి ఏకంగా రూ.225 కోట్లతో ప్రైవేటు టెండర్లు పిలవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. ఇంజనీర్ల లెక్కల ప్రకారం, ఈ పనులను జెన్కో సంస్థే స్వయంగా నిర్వహిస్తే రూ.60 కోట్లు ఆదా చేయవచ్చు. వాస్తవ పరిస్థితులను, ఆదా అవుతున్న నిధుల వివరాలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా, ప్రభుత్వం పట్టించుకోకుండా టెండర్లను కొనసాగిస్తుండటంపై అనుమానాలు మొదలయ్యాయి.

**ప్రైవేటుకే కట్టబెట్టేలా టెండర్ గడువు పెంపు**
సాధారణంగా కొత్త పనులకు ఒక ఏడాది కాలానికి టెండర్లు పిలవాలి. పనితీరు బాగుంటేనే గడువు పెంచాలి. కానీ, మొదటి సారే మూడేళ్ల కాలానికి టెండర్లు పిలవడం, ఆ తర్వాత దానికి గడువు పొడిగించడం చూస్తుంటే.. ఏదో ఒక నిర్దిష్ట కంపెనీకే పనులు అప్పజెప్పేలా కుట్ర జరుగుతోందని ఉద్యోగ సంఘాల జేఏసీ ఆరోపిస్తోంది. ఈ టెండర్ల ద్వారా 1,913 మందిని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో తీసుకునే అవకాశం ఉండటంతో, నిబంధనల పేరుతో ఈ మొత్తం వ్యవహారం ప్రైవేటు పరం చేసేందుకు అడుగులు పడుతున్నాయని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

**మంత్రి మౌనం.. ప్రైవేటీకరణ సంకేతాలేనా**
విద్యుత్ శాఖను అంచెలంచెలుగా ప్రైవేటు పరం చేయాలనే ప్రభుత్వ ఆలోచనలో భాగంగానే ఇదంతా జరుగుతోందని ఉద్యోగ సంఘాలు నమ్ముతున్నాయి. ఈ విషయంపై గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున నిరసనలు, చర్చలు జరుగుతున్నా, సంబంధిత మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ప్రభుత్వ తీరుపై



స్పష్టత లేకపోవడంతో, సంస్థను ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నేడు 'చలో వైటిపిఎస్'..**
ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా గత కొన్ని రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నేడు పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నారు. విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపు మేరకు, భారీ సంఖ్యలో ఉద్యోగులు 'చలో వైటిపిఎస్' కార్యక్రమానికి సిద్ధమయ్యారు. ప్రాజెక్టు వద్ద భారీ ధర్నా నిర్వహించి తమ నిరసన గళాన్ని వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలో వైటిపిఎస్ వద్ద ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తుతాయోనన్న ఆందోళన నెలకొంది. సంస్థను, ఉద్యోగుల హక్కులను కాపాడుకునే వరకు పోరాటం ఆపేది లేదని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.



# రూ.70 వేల లంచం తీసుకుంటూ చిక్కిన తహసీల్దార్

- **చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను పట్టుకున్న ఏసీబీ**
- **భూ వినియోగ మార్పిడి అనుమతులకు లంచం డిమాండ్**
- **అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు**

**సిద్దిపేట, జులై 6, సిరి న్యూస్:**
సిద్దిపేట జిల్లా చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు అనుమతులు మంజూరు చేసే పేరుతో ఓ రైతు నుంచి రూ.70 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భూ వినియోగ మార్పిడి ప్రక్రియ పూర్తి చేయాలంటే లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేసినట్లు బాధిత రైతు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు పథకం ప్రకారం ఉచ్చపన్ని రైతు ద్వారా లంచం ఇప్పించగా, నగదు స్వీకరిస్తున్న సమయంలోనే దాడి చేసి తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ వద్ద నుంచి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు అవసరమైన రసాయన పరీక్షలు నిర్వహించి కేసు నమోదు చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు పత్రాలను పరిశీలించి కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించారు. తహసీల్దార్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రజలు లంచం డిమాండ్ చేసిన అధికారులపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచిస్తూ, దర్యాప్తు పూర్తయిన తర్వాత నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని వెల్లడించారు.





# ట్రాన్స్‌ప్లాంట్ సేవలకు టిమ్స్ సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**
నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు చెందిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లతో కలిసి టిమ్స్‌ను సందర్శించిన మంత్రి, అక్కడి అత్యాధునిక వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఆస్పత్రిలోని మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, శస్త్రచికిత్సకు ముందు, తర్వాత రోగుల కోసం ఏర్పాటు చేసిన వార్డులు, ఐసీయూలు, ఇతర వైద్య సౌకర్యాలను మంత్రి పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశమై ట్రాన్స్‌ప్లాంట్ సేవల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
టిమ్స్‌ను కిడ్నీ, కాలేయం, గుండెతో పాటు ఇతర అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించే సమగ్ర వైద్య కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను మరింత విస్తరించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ఇందుకు అవసరమైన సూచనలు అందించాలని వైద్యులను కోరారు.
టిమ్స్‌లో ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్సలకు అవసరమైన ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, వైద్య పరికరాలు సిద్ధంగా ఉన్నాయని వైద్యులు వివరించారు. దశలవారీగా వివిధ అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ప్రారంభించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. నిమ్స్‌లో ఆపరేషన్ థియేటర్ల కొరత కారణంగా పెండింగ్‌లో ఉన్న క్లిష్ట శస్త్రచికిత్సలను టిమ్స్‌లో నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.
సనత్‌నగర్ టిమ్స్‌ను నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి కలిగిన వైద్య సంస్థగా అభివృద్ధి చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. టిమ్స్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గడంతో పాటు ట్రాన్స్‌ప్లాంట్, ఇతర క్లిష్ట శస్త్రచికిత్సల కోసం రోగులు ఎక్కువకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.



# ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్‌లో కీలక మార్పులు

**మొదటిపేజీ తరువాయి**
విద్యార్థులకు కూడా 15 మార్కులకు ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనుంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రస్తుతం అమలులో ఉన్న 15 మార్కుల ప్రాక్టికల్ విధానం కొనసాగుతుందని బోర్డు వెల్లడించింది.
థియరీ పరీక్షలు యథావిధిగా 60 మార్కులకే నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు రెండింటినీ బోర్డు నియమించిన బాహ్య పరీక్షాధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపింది.
కొత్త విధానానికి అనుగుణంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించిన ల్యాబ్ మాన్యువల్స్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. వీటిలో ప్రాక్టికల్ సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాలు, నెలవారీ కార్యాచరణను పొందుపరిచింది. కళాశాలలు ప్రాక్టికల్ తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించి, విద్యార్థులతో అన్ని ప్రయోగాలు పూర్తి చేయించాలని బోర్డు ఆదేశించింది.
ప్రథమ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షను గంటన్నర వ్యవధిలో నిర్వహించనున్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ప్రిన్సిపాల్ లేదా అధ్యాపకుడు ధృవీకరించిన ప్రాక్టికల్ రికార్డు పుస్తకాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. పరీక్షలు ముగిసిన వెంటనే మార్కులను బోర్డు నిర్దేశించిన గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించింది. ల్యాబ్‌లలో అవసరమైన పరికరాలు, రసాయనాలు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉంచడంతో పాటు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన అన్ని రికార్డులను కళాశాలలు భద్రపరచాలని ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశించింది. పరీక్షల నిర్వహణలో అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘన జరిగితే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కళాశాలల్లో ప్రాక్టికల్ తరగతులు, పరీక్షల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రిన్సిపాల్‌లదేనని బోర్డు స్పష్టం చేసింది.

# అన్నదాత అయోమయం!

**మొదటిపేజీ తరువాయి**
రైతులు పూర్తిగా వర్షాలపైనే ఆధారపడ్డారు.

**పడిపోయిన భూగర్భ జలాలు..**
సాధారణంగా వానాకాలంలో పెరగాల్సిన భూగర్భ జలాలు..వర్షాలు లేకపోవడంతో మరింత కిందికి పడిపోయాయి. దీంతో ఉమ్మడి మెదక్, నల్గొండ జిల్లాల్లో వేలాది బోర్లు ఎండిపోయి నీరు రావడం లేదు. ఉత్తర తెలంగాణ (ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్)లో జూన్ జూలైలో సాధారణ వర్షపాతం 260 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 140 మి.మీ వర్షపాతం కురిసింది. దీంతో 46 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దక్షిణ తెలంగాణ (మహబూబ్‌నగర్, నల్గొండ)లో 170 మి.మీ సాధారణ వర్షపాతం ఉండగా 80 మి.మీ



మాత్రమే కురిసింది. 53 శాతం లోటు ఏర్పడింది. మధ్య తెలంగాణ (వరంగల్, ఖమ్మం, మెదక్)లో సాధారణ వర్షపాతం 210 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 110 మి.మీ మాత్రమే కురిసింది. దీంతో 47 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

**లక్ష్యం 1.32 కోట్ల ఎకరాలు..**
ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,32,44,305 ఎకరాలలో (సుమారు 1.32 కోట్ల ఎకరాలు) పంటలు సాగు కావాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఎప్పటిలాగే వరి, పత్తి పంటలదే మెజారిటీ వాటా ఉండగా సన్న వరి సాగుకు రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారు. జూలై మొదటి వారం నాటికి కేవలం 33.27 లక్షల ఎకరాల్లోనే సాగు ప్రారంభమైంది. వర్షాభావ పరిస్థితుల వల్ల నిరుటి కంటే ఇది 10 లక్షల ఎకరాలు తక్కువగా నమోదైంది.

**ఎదురవుతున్న సవాళ్లు..**
ప్రస్తుత సంక్షోభం నుండి రైతాంగాన్ని గట్టెక్కించడానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాలు మరింత ఆలస్యమైతే తక్కువ కాల వ్యవధిలో పండే ప్రత్యామ్నాయ పంటల (పెసర్లు, మినుములు, సజ్జలు) విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం సబ్సిడీపై వెంటనే సరఫరా చేయాలి. బోర్ల కింద ఉన్న అరకొర పంటలను కాపాడుకోవడానికి వీలుగా వ్యవసాయానికి నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని, సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం అందించడం ద్వారా విత్తనాలు నష్టపోయిన రైతులకు కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుందని రైతులు కోరుతున్నారు.





# కాళేశ్వరంపై బీఆర్ఎస్‌కు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది: పొంగులేటి

మొదటిపేజీ తరువాయి

తప్పుబట్టారు.
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ, పేదలకు సొంత ఇళ్లు నిర్మించడంపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదని మంత్రి విమర్శించారు. ప్రాజెక్టును నిర్మించింది, ప్రారంభించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు అదే ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.
ఎన్డీఎస్ఏ సూచనల ప్రకారం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయడంపై పరిమితులు ఉన్నాయని గుర్తు చేసిన మంత్రి, ఈ విషయాలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి వివరించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సభలో పూర్తి స్థాయి చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.
పేదల గృహాల నిర్మాణంపై కూడా మంత్రి స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించి పూర్తి చేయని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మరమ్మతులు చేసి త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అవసరమైన నిధులను సమకూర్చి పేదల గృహ కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

# గవర్నర్‌ను కలిసిన టెలిమెడిసిన్ సొసైటీ ప్రతినిధులు

- **టెలిమెడిసిన్ సేవల విస్తరణపై చర్చ**
- **గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన వైద్యం అందించడంపై దృష్టి**
- **సాంకేతికతతో ఆరోగ్య సేవలు మరింత చేరువ చేయాలని సూచన**



**హైదరాబాద్, జులై 6, సిరి న్యూస్:**

టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రామచంద్ర విష్ణుభట్ట నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో టెలిమెడిసిన్ సేవల విస్తరణ, సాంకేతికత ఆధారిత వైద్య సేవల అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. టెలిమెడిసిన్ సేవల ద్వారా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలను సులభంగా అందించవచ్చని ప్రతినిధులు గవర్నర్‌కు వివరించారు. ఆరోగ్య రంగంలో డిజిటల్ సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను కూడా వివరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ అభిప్రాయపడినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. టెలిమెడిసిన్ సేవల విస్తరణ ద్వారా ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే అవకాశాలపై కూడా పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. భవిష్యత్తులో టెలిమెడిసిన్ సేవలను మరింత విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో టెలిమెడిసిన్ సొసైటీకి చెందిన పలువురు సభ్యులు పాల్గొని, అనంతరం గవర్నర్‌తో జ్ఞాపికలు మార్చుకుని సమావేశాన్ని ముగించారు.

## సినీ నిర్మాత అనీష్ రెడ్డిపై చీటింగ్ కేసు

- **రూ.40 లక్షల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు**
- **డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులంటూ ఆరోపణ**
- **పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు**

**హైదరాబాద్, జూలై 6, సిరి న్యూస్:**

సినీ నిర్మాత వెంకట్ అనీష్ రెడ్డిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. నిర్మాత రజిత్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మోసం సహా పలు నేరాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదుదారు రజిత్ రావు తెలిపిన వివరాల ప్రకారం, అనీష్ రెడ్డి అవసరాల కోసం మాజీ పోలీసు అధికారి ఏకే ఖాన్ కుమారుడి వద్ద నుంచి రూ.40 లక్షలు ఇప్పించినట్లు పేర్కొన్నారు. తన రుణాలు తీర్చుకున్న వెంటనే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని అనీష్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫిర్యాదులో వివరించారు. అయితే నిర్ణయించిన గడువు ముగిసినా డబ్బులు తిరిగి చెల్లించకుండా తప్పించుకుంటున్నారని, బకాయి గురించి ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని రజిత్ రావు ఆరోపించారు. ఈ వ్యవహారంలో తనను మోసం చేశారని పేర్కొంటూ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదును పరిశీలించిన జూబ్లీహిల్స్ పోలీసులు అనీష్ రెడ్డిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 318(4), సెక్షన్ 351(2)తో పాటు ఇతర సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేశారు.





# బిల్లింగ్ ప్రక్రియలో ఖచ్చితత్వం పెంచాలి..

**హైదరాబాద్, జూలై 6 (సిరి న్యూస్):**

విద్యుత్ సేవలలో నాణ్యతను పెంచేందుకు టీజీఎస్పీడీసీఎల్ అత్యంత పారదర్శకమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం, వెంగళరావునగర్ ప్రాంతంలో ఫీడర్ మరియు స్ట్రక్చర్ కోడ్ ఆధారిత బిల్లింగ్ ప్రక్రియపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని సిబ్బంది, ఆర్టిజన్లు, ప్రైవేట్ మీటర్ రీడర్లతో నేరుగా మాట్లాడారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు జారీ చేసే స్పాట్ బిల్లులు తప్పనిసరిగా స్ట్రక్చర్ కోడ్ ఆధారంగానే నమోదు కావాలన్నారు. దీనివల్ల బిల్లింగ్‌లో ఖచ్చితత్వం పెరిగి, విద్యుత్ నెట్‌వర్క్‌పై పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది అని అధికారులకు సూచించారు. డీటీఆర్ స్థాయిలో సర్వీసుల మ్యాపింగ్ చేయడం వల్ల విద్యుత్ అంతరాయాలను వేగంగా గుర్తించి, సాంకేతిక మరియు వాణిజ్య నష్టాలను అరికట్టవచ్చని ఆయన వివరించారు. అనంతరం నిర్వహించిన లైన్‌మెన్ల భద్రతా అవగాహన కార్యక్రమంలో సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల ప్రాణాలు సంస్థకు చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. పని ప్రారంభానికి ముందు లైన్ క్లియర్ పొందడం, వ్యక్తిగత భద్రతా పరికరాలు ధరించడం, ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వంటి నిబంధనలలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు. ప్రతి ఉద్యోగి సురక్షితంగా తన కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడమే సంస్థ ముఖ్య లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీ మరియు సమీక్షా సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, ఎస్ఈ (బంజారాహిల్స్), డీఈ, ఏడీఈలు, ఏఈలతో పాటు ఎస్‌కే నగర్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు. బిల్లింగ్ నాణ్యతతో పాటు ఉద్యోగుల భద్రతను సమాన ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్లేందుకు సంస్థ కట్టుబడి ఉందని సీఎండీ మరోసారి పునరుద్ఘాటించారు.





# ప్రభుత్వ విప్‌లకు ప్రత్యేక కార్యాలయాలు

**హైదరాబాద్, జులై 6, సిరి న్యూస్:**

తెలంగాణ ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే వేముల వీరేశంలకు శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యాలయాలను సోమవారం మంత్రులు ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో విప్‌లు మరింత సమర్థంగా పనిచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యాలయాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు విప్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో, శాసనసభ కార్యకలాపాల్లో సమన్వయం కల్పించడంలో విప్‌ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ప్రత్యేక కార్యాలయాల ఏర్పాటు వల్ల ప్రజల సమస్యలను వేగంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలును క్షేత్రస్థాయిలో మరింత సమర్థంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో విప్‌లు చురుకైన పాత్ర పోషించాలని, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిరంతర సమన్వయంతో పనిచేయాలని మంత్రులు సూచించారు. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించే దిశగా ప్రత్యేక కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. నూతన కార్యాలయాలను సందర్శించి విప్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# రూ.300 కోట్ల అక్రమాస్తుల కేసు..
# డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

నాలుగు రోజుల క్రితం నిర్వహించిన సోదాల్లో భారీగా ఆస్తులు వెలుగులోకి వచ్చినప్పటికీ, భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేయకుండా నోటీసులు ఇచ్చి పంపించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై స్పందించిన ఏసీబీ అధికారులు, సోదాల సమయంలో ఆయన అనారోగ్యంతో ఉండటంతో అరెస్ట్ చేయలేదని వివరణ ఇచ్చారు.
తాజాగా భీమ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న అధికారులు, కేసుకు సంబంధించిన అంశాలపై విచారణ కొనసాగిస్తున్నారు. అక్రమాస్తుల వ్యవహారంలో మరిన్ని ఆధారాలను సేకరించే దిశగా దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం. భీమ్‌రెడ్డిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్న అధికారులు, విచారణ కోసం ఆయనను కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో వెల్లడయ్యే అవకాశం ఉంది.



# రష్యా వర్క్ పర్మిట్ వీసాల పేరుతో రూ.9.37 లక్షల మోసం

- **ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసిన మాచారెడ్డి పోలీసులు**
- **నగదు, పాస్‌పోర్టులు, మొబైల్, ద్విచక్రవాహనం స్వాధీనం**

**కామారెడ్డి, జూలై 6, సిరి న్యూస్:**

రష్యా వర్క్ పర్మిట్ వీసాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.9.37 లక్షలు వసూలు చేసిన మోసగాళ్ల ముఠా గుట్టును మాచారెడ్డి పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి నగదు, పాస్‌పోర్టులు, మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పలువురిని నమ్మించిన నిందితులు వారి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. అనంతరం వీసాలు, ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేసినట్లు బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో ప్రధాన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.45 వేల నగదు, మూడు పాస్‌పోర్టులు, ఒక మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న పోలీసులు ఆ దిశగా కూడా విచారణ కొనసాగిస్తున్నారు. విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రభుత్వ అనుమతులు పొందిన సంస్థల ద్వారానే విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని, ఎలాంటి ధృవీకరణ లేకుండా డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు. ఇలాంటి మోసాలపై సమాచారం తెలిసినా, బాధితులైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని కోరారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.



# ప్రగతి ప్రాజెక్టుల అమలు వేగవంతం చేయాలి

- **నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశం**
- **శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచన**

**హైదరాబాద్, జూలై 6, సిరి న్యూస్:**

రాష్ట్రంలో అమలవుతున్న ప్రగతి ప్రాజెక్టుల పురోగతిని వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో వివిధ శాఖల కీలక ప్రాజెక్టుల అమలును పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రధాన కార్యదర్శి, ప్రతి ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పనుల్లో జాప్యానికి కారణమయ్యే అంశాలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.
అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలితాలు సకాలంలో అందేలా ప్రతి ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రగతి ప్రాజెక్టుల విజయవంతమైన అమలు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్న రామకృష్ణారావు, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ శాఖలకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి మరోసారి ఆదేశించారు.



## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి..

- ప్రతి ఓటు అత్యంత కీలకం: ఎమ్మెల్యే జీఎంఆర్
- జూలై 12న పటాన్‌చెరులో హరీష్ రావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**పటాన్‌చెరు, జూలై 6 (సిరి న్యూస్):**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకునేలా అప్రమత్తంగా ఉండాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం, బీఎల్‌వోలు విఫలమయ్యారని ఆయన విమర్శించారు.సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ తరఫున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు ప్రతి ఓటరును కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, అర్హులైన వారి ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని సూచించారు. పటాన్‌చెరు మినీ ఇండియాగా పేరొందిన ప్రాంతం కావడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలకు కూడా ఈ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్ఐఆర్‌తో పాటు బీఆర్ఎస్ డిజిటల్ మెంబర్‌షిప్‌పై అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మాజీ మంత్రి టి. హరీష్ రావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును పరామర్శించిన ఆదర్శ్ రెడ్డి



**పటాన్ చెరు, జూలై 6 (సిరి న్యూస్):**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి సోమవారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన శంభిపూర్ రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తిగా కోలుకుని ప్రజా సేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పార్టీకి ఆయన అందిస్తున్న సేవలు మరింత కాలం కొనసాగాలని కోరుకుంటూ ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జిన్నారం వెంకటేష్ గౌడ్ కూడా పాల్గొని శంభిపూర్ రాజును పరామర్శించి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే జీఎంఆర్..



**పటాన్ చెరు, జూలై 6 (సిరి న్యూస్):**

భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేసిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు బిక్షపతి, శంకర్, వెంకటేష్, బల్వంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ కలెక్టరేట్ గా తీర్చి దిద్దుదాం.!

- కలెక్టరేట్ కార్యాలయాలు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి.
- వ్యర్థాలను సక్రమంగా వేరు చేయండి - శుభ్రమైన మెదక్ కు నాంది పలకండి
- వివిధ శాఖల అధికారులకు నాలుగు రకాల డస్ట్ బీన్స్ పంపిణీ.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్,జూలై,06(సిరి న్యూస్)**

స్వచ్ఛ కలెక్టరేట్ మనందరి బాధ్యత అని వ్యర్థాలు సక్రమంగా వేరు చేసి పరిశుభ్రమైన కలెక్టరేట్ గా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి హాల్ నందు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలు అనుసరిస్తూ అధికారులకు అవగాహన కల్పిస్తూ జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నాలుగు రకాల డస్ట్ బిన్స్ ను అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పక్కా ప్రణాళికతో కలెక్టరేట్ కార్యాలయాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్వచ్ఛ మెదక్ తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రజలు కంకణబద్ధులై పని చేయాలన్నారు.ప్రతి కార్యాలయాల్లో నాలుగు డస్ట్ బిన్స్ అందుబాటులో ఉంచాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మీ కార్యాలయాల్లో పేర్కొన్న చెత్తను వీరి వీరి గా సపరేట్ చేసి డస్ట్ బీన్స్ లలో వేయాలన్నారు. పర్యవేక్షణకు ప్రతి కార్యాలయంలో ఒకరు బాధ్యత తీసుకోవాలి అన్నారు.నాలుగు రకాల చెత్త తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త ప్రత్యేక జాగ్రత్త చెత్త గా వేరుచేసి ఇవ్వాలని ,తడి చెత్తకు ఆకుపచ్చ రంగు డస్ట్ బిన్, పొడిచేతకు బ్లూ కలర్,సానిటరీ చెత్తకు రెడ్ కలర్ ప్రత్యేక జాగ్రత్త చెత్తకు బ్లాక్ కలర్ డస్ట్ బిన్లను వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

- ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం ఉండొద్దు.
- సంబంధిత అధికారులకు ఆదేశించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు,

**మెదక్ జూలై,06(సిరి న్యూస్)**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదికను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.సోమవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక,భూ వివాదాలు,మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ పేర్కొన్నారు.నడవలేని స్థితిలో వచ్చిన ఫిర్యాదు దారుని ఆటో వద్దకు ఎస్పీ స్వయంగా వెళ్లి పిర్యాదు స్వీకరించి శాఖ పరమైన న్యాయం చేస్తమని భరోసా ఇచ్చారు.



# మన్నెగూడెంలో విత్తనాల పంపిణీ..

- 100% సబ్సిడీతో కూరగాయల విత్తనాల పంపిణీ..
- మన్నెగూడెం రైతులకు ఐదు రకాల విత్తనాలు..
- ఎమ్మెల్యే వినోద్ ఆదేశాలతో కార్యక్రమం..
- గోలేటి సంధ్య ఆధ్వర్యంలో పంపిణీ..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 6 ( సిరి న్యూస్ )**

నెన్నెల మండలం మన్నెగూడెం గ్రామంలో రైతులకు వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న ఐదు రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు కూరగాయల సాగును ప్రోత్సహించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలేటి సంధ్య ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగును మరింత విస్తరించాలని, అందుబాటులో ఉన్న సబ్సిడీ అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి అరుణ్, ఉద్యానవన విస్తరణ అధికారి కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి శివకుమార్‌తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.




# ఫీజు బకాయిలపై విద్యార్థుల భగ్గుమంట..

- ఫీజు బకాయిలు విడుదల చేయాలి..
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..
- రూ.8 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి..
- సర్టిఫికెట్లకు విద్యార్థుల తిప్పలు..

**మంచిర్యాల, జిల్లా ప్రతినిధి, జూలై 6 ( సిరి న్యూస్ ):**

గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశాయి. ఐక్య విద్యార్థి సంఘాలైన తెలంగాణ విద్యార్థి విప్లవ వేదిక, తెలంగాణ విద్యార్థి సంఘం, నేషనల్ స్టూడెంట్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థి విప్లవ వేదిక నాయకుడు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పూర్తిగా విస్మరించిందన్నారు. గత ఐదేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లకు పైగా పేరుకుపోయాయని ఆరోపించారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యా సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు తమ సర్టిఫికెట్ల కోసం ప్రైవేటు కళాశాలల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు ఇవ్వబోమంటూ యాజమాన్యాలు విద్యార్థులను బెదిరిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో తెలంగాణ విద్యార్థి సంఘం నాయకుడు రేగుంట క్రాంతి కుమార్, నేషనల్ స్టూడెంట్స్ కాంగ్రెస్ నాయకుడు బచ్చలి అభిరామ్, విద్యార్థులు కిరణ్, అనిల్, స్వామి, జంగు పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ పారాల ప్రక్రియ పై అధికారుల కీలక సమావేశం

**అమీన్పూర్ జులై 06 సిరి న్యూస్**

అమీన్పూర్ జిహెచ్ఎంసి,మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట్ ఎల్లంకి కళాశాలలో సోమవారం డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, తాసిల్దార్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీలక సమావేశం జిహెచ్ఎంసి, మండల పరిధిలోని ఏఎంసి, జూరిస్డిక్షన్ లో ఎస్ ఐ ఆర్ పారాల పూరింపు,మరియు ఎన్యుమరేషన్ పక్రియ పై, బి ఎల్ ఓలకు, మాస్టర్ ట్రైనర్స్, సూపర్వైజర్లకు క్షేత్రస్థాయి సిబ్బందికి పలు కీలక సూచనలు చేసాం అని తెలిపారు. మాస్టర్ ట్రైనర్స్ గైడ్ ఎస్ ఐ ఆర్ పారాలను ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఎలా పూజించాలని అంశంపై మాస్టర్ ట్రైనర్స్ గైడ్ ద్వారా అవగాహన కల్పించామని తెలిపారు. సిబ్బంది భాగస్వామ్యం అవగాహన సదస్సులో బిఎల్ఓ లు, సూపర్వైజర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.నిర్దేశిత గడువులోగా అత్యంత కచ్చితత్వంతో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఎక్కడ ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశామని తెలిపారు.



# సమస్యల ఒడి - ప్రభుత్వ బడి

- విషపురుగులకు నిలయాలు - విద్యాలయాలు
- ఎటు చూసినా చెట్లు మురుగు కాలువలు

**వెల్దుర్తి జులై 06, (సిరి న్యూస్ ):**





వెల్దుర్తి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాల తోపాటు హస్తాల్పూర్, ఎలుకపల్లి, ఆరెగూడెం, గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో అనేక సమస్యలు చోటుచేసుకున్నాయి. పలు పాఠశాలలో పూర్తికాని గదులు నీటి ట్యాంకులు, అలాగే చెత్తచెదారం పిచ్చి మొక్కలతో పాఠశాల ఆవరణ మొత్తం నుండి ఉన్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలకు కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్న పాఠశాలలో మాత్రం పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెలవుల అనంతరం పాఠశాలలు చిన్నారులకు సమస్యలతోనే స్వాగతం పలు కుతున్నాయి. వెల్దుర్తి మండల కేంద్రంలో గల ప్రాథమిక పాఠశాలలో చుట్టూ పిచ్చి మొక్కలతో నిండిపోయి విషపురుగులకు నిలయాలుగా మారాయి. అంతేకాకుండా వాటర్ ట్యాంక్ కూడా లేక పిల్లలు మధ్యాహ్నం భోజనం అనంతరం చేతులు కడుక్కోవడం కూడా చాలా ఇబ్బందిగా ఉందని పిల్లల తల్లిదండ్రులు అలాగే పాఠశాల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎటు చూసినా చెత్త చెదారం, పాఠశాల మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉందని మూత్రశాలు కూడా సరిగ్గా లేవని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య. హస్తలపూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చుట్టూ ప్రహరీ గోడ లేక విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ చెట్లు,చెదారము, మురుగునీరు, అలాగే పాడైన వాటర్ ట్యాంక్, అసంపూర్తిగా ఉన్న మంచినీళ్ల సంపు, వర్షాకాలం నేపథ్యంతో దోమల బెడద కూడా వచ్చే అవకాశం ఉందని వాటి వల్ల డెంగ్యూ మలేరియా రోగాలు బారిన పడే అవకాశం ఉంటుందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇవన్నీ హస్తాల్పూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలు. కొన్ని పాఠశాలలో వంట షెడ్డు లేక ఆరు బయటనే వంటలు చేయడం జరుగుతుందని, పిల్లలు కూర్చోవడానికి గదులు కూడా సరిగ్గా లేవని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఎలుక పల్లి గ్రామంలో వంట రూమ్ లేక ఆరు బయటనే వంట చేయవలసి వస్తుందని వర్షం పడితే చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వంటమనిషి, తల్లిదండ్రులు ఆవేదం చెందుతున్నారు. ఆరెగూడెం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల శిథిలావస్థలో ఉందని అలాగే తరగతులు నాలుగు గది మాత్రం ఒకటే అయిందని పలుమార్లు గ్రామ సర్పంచ్,మండల అధికారులకు చెప్పిన ఫలితం లేకపోయిందని వారు వాపోయారు. మంచినీళ్లు అందుబాటులో ఉన్న సరైన పైపులైన్ లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అందరూ చిన్నపిల్లలే అవడంతో చుట్టూ పిచ్చి మొక్కలతో ఉండడంతో విషపురుగులు వలన ఏ క్షణాన ఏం జరుగుతుందో అని వెల్దుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సృజన ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెనువెంటనే ఇట్టి పాఠశాల మరమ్మత్తులు అలాగే పిచ్చి మొక్కల తీసివేయటకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కూడా కోరుతున్నారు.






# ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

- విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలి.
- పట్టణ ప్రాంతాలకు విస్తరించాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి

**శివంపేట్ జులై 6,(సిరి న్యూస్ )**

సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి లో వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వామపక్ష పోరాటాల ఫలితంగా గ్రామీణ పేదలకు వందరోజుల ఉపాధి హామీ పథకం ఏర్పడిందని అన్నారు. 90% కేంద్రం నిధులు కేటాయిస్తూ పది శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులతో గ్రామీణ పేదలకు వంద రోజులు పని కల్పించడం జరుగుతుందని దాని ద్వారా పేదలు తమ జీవితాల్లో వెలుగులు తెచ్చుకుంటున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని పరోక్షంగా నిర్వీర్యం చేయడానికి కుట్ర చేసిందని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి వికసిత భారత్ గ్యారంటీ రోజ్ గార్ అభిజిత్ మిషన్ రూరల్ ( VBGRAMG) పేరు మార్చి కేంద్రం 60 శాతం నిధులు, రాష్ట్రం 40% నిధులతో పథకం నడపాలని నిబంధన పెట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్రాల నిధుల లేమితో 40% కేటాయించలేక క్రమంగా ఉపాధి హామీ పథకాన్ని పేదలకు లేకుండా చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పథకం రద్దుచేసి యధావిధిగా పాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని పట్టణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక



పోరాటాలు నిర్వహిస్తుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే వరకు ప్రజాసంఘాలను ప్రజాతంత్ర వాదులను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి అర్జీలపై కలెక్టర్ కఠిన ఆదేశాలు..

- ప్రజావాణి అర్జీలకు వేగవంతమైన పరిష్కారం: కలెక్టర్ ఆదేశం..
- ఒక్కరోజే 79 వినతులు స్వీకరణ..
- రేషన్ షాప్, ఇళ్లు, భూమి, ఉద్యోగాలపై అర్జీలు..
- ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయి విచారణ..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 6 ( సిరి న్యూస్ ):**

ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ఆదేశించారు.నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చందనాపూర్ గ్రామానికి రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కడియాల పద్మ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉపాధి కల్పించాలని పాగిడి శోభ, కాంట్రాక్టర్ బస్తీలో సమస్యలు పరిష్కరించాలని కొలిపాక శ్రీనివాస్, గరిమెళ్లలో కొనుగోలు చేసిన భూమికి పేరుమార్పు చేయాలని బాసపోయిన రవీంద్ర కుమార్, భూ ఆక్రమణ నుంచి న్యాయం చేయాలని రాచర్ల సంతోష్ వినతులు సమర్పించారు.తెలంగాణ లైబ్రరీ సైన్స్ విద్యార్థులు, నిరుద్యోగుల సంఘం గ్రంథాలయాల్లో ఖాళీల భర్తీ కోరగా, భారత విద్యార్థి సమాఖ్య ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ కోరింది. ప్రజావాణిలో మొత్తం 79 అర్జీలు అందాయని, ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

# ఫీజు రాయితీ కోరుతూ వినతి పత్రం అందజేత

- జర్నలిస్ట్ పిల్లలకు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీకి జర్నలిస్ట్ ల డిమాండ్
- విద్యాసంస్థలు తెరిచి ఇన్ని రోజులైన సర్క్యులర్ విడుదల చేయని అధికారులు
- నిరసన తెలిపిన జర్నలిస్ట్ లు

**నల్లగొండ సిరిన్యూస్ జులై6:**

జర్నలిస్ట్ పిల్లలకు విద్య సంస్థల్లో ఫీజు రాయితీ కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లాలో అధికారులకు జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూనే వినతి పత్రాలు అందజేశారు. టీయూ డబ్ల్యు జే(ఐ జేయు) జిల్లా కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో జర్నలిస్టులు ధర్నాలు , నిరసనలు తెలిపారు. జిల్లా కేంద్రంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నిడమనూరు మండలంలో మండల శాఖ అధ్యకుడు కే. బాలకోటి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బత్తుల సూరయ్య ఆధ్వర్యంలో తహసిల్దార్ జంగాల కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకటరెడ్డి, కోశాధికారి



జువ్వి రాజు, జిల్లా ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి చీదల్ల నరహరి, సభ్యుడు కంచర్ల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన చికిత్సలో ఫ్లూయిడ్ మెకానిక్స్ కీలకం..

గీతంలో నైపుణ్యోపన్యాసంలో ఎన్ఐటీ ప్రొఫెసర్ ధర్మేంద్ర త్రిపాఠి



**పటాన్చెరు, జూలై 6 (సిరి న్యూస్):**

బయోమెడికల్ పరిశోధనలో మెకానికల్ ఇంజనీరింగ్ కీలక పాత్ర పోషిస్తోందని, అధునాతన చికిత్సా విధానాల అభివృద్ధికి ఫ్లూయిడ్ మెకానిక్స్ ఎంతో దోహదపడుతోందని ఎన్ఐటీ–ఉత్తరాఖండ్ ప్రొఫెసర్ ధర్మేంద్ర త్రిపాఠి అన్నారు.హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'జీవ వ్యవస్థలలో ద్రవ గతిశీలత విశ్లేషణ' అంశంపై నైపుణ్యోపన్యాసంలో ఆయన ప్రసంగించారు.జీవ వ్యవస్థలలో ద్రవ గతిశాస్త్రం వినియోగం, వ్యాధుల నిర్ధారణ, చికిత్సా విధానాల అభివృద్ధిలో దాని ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ప్రసరణ, శ్వాసకోశ, జీర్ణ, మూత్ర, పునరుత్పత్తి వ్యవస్థల పనితీరును అర్థం చేసుకోవడంలో ఫ్లూయిడ్ మెకానిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే క్యాన్సర్ వంటి వ్యాధులపై పరిశోధనలు, ఆధునిక వైద్య చికిత్సల రూపకల్పనలో ఈ శాస్త్రం వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయప్రకాష్ శ్రీవాస్తవ, ప్రొఫెసర్ కె. మారుతి ప్రసాద్, ప్రొఫెసర్ ఎన్. వంశీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇష్టంతో చదవండి.. లక్ష్యాన్ని సాధించండి

- ఎమ్మెల్యే జీఎంఆర్
- ప్రతిభావంతులైన పదో తరగతి విద్యార్థులకు నగదు పురస్కారాలు




**పటాన్ చెరు, జూలై 6 (సిరి న్యూస్):**

ఇష్టపడి చదివి, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలోని ఎంకేవై ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, ఇతర నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇటిక్యాల శ్రీ పెద్దమ్మ, తల్లి, దుర్గమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠకు మాజీ మంత్రులకు ఆహ్వానం...!

**గజ్వేల్ జులై 06 (సిరి న్యూస్ )**





జగదేవ్‌పూర్ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ పెద్దమ్మ తల్లి, శ్రీ దుర్గమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును గ్రామ సర్పంచ్ దిన రాజలింగం, ఉప సర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ గుప్తా, మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నేతలకు ఆహ్వాన పత్రికలు అందజేసి, మహోత్సవానికి హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ దిన రాజలింగం మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారంతో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ పెద్దమ్మ తల్లి, శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులు పొందాలనిభక్తులను కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అనిల్, భాస్కర్, మౌనిక ప్రకాశ్, బాబు, స్వామి, నాయకులు జానకిరాములు, మల్లేష్, సాయిలు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



- దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జూలై,07(సిరి న్యూస్)**

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారుల అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.సోమవారం మీటింగ్ హాల్లో ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్లో ఉంచొద్దన్నారు. శాఖల వారిగా ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో వివిధ సమస్యలపై 66 ధరఖాస్తులు రాగ వాటిలో భూభారతి 24,ఇందిరమ్మ ఇళ్ళు12, పెన్షన్ లు 03,ఇతర సమస్యలపై 27 వచ్చాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు బీడీఎల్ పోలీసుల చొరవ..

- సీఐ విజయ్ కృష్ణ ఆధ్వర్యంలో నందిగామ ప్రవేశం వద్ద రోడ్డు భద్రత చర్యలు

**పటాన్‌చెరు, జూలై 6 (సిరి న్యూస్):**

భానూర్ నుంచి నందిగామ వెళ్లే ప్రధాన రహదారిపై నందిగామ గ్రామ ప్రవేశం వద్ద నారాయణ కళాశాల సమీపంలోని ప్రమాదకర మూల మలుపు వద్ద బీడీఎల్ సీఐ విజయ్ కృష్ణ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా వాహనదారుల విజిబిలిటీకి ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు, రోడ్డు ఒక వైపున మట్టి పోయించి మార్గాన్ని మరింత సురక్షితంగా తీర్చిదిద్దారు.ఈ ప్రాంతంలో గతంలో నాలుగు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో వాహనదారులకు మెరుగైన విజిబిలిటీ కల్పించి, ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అవసరమైన రోడ్డు భద్రత చర్యలను కొనసాగిస్తామని బీడీఎల్ పోలీసులు తెలిపారు.



## రోడ్డుపై గుంతలు పూడ్చివేత..



- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు..

**హత్నూర , జూలై 06,(సిరి న్యూస్)**

గుంతల మయమైన రోడ్డును గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను సిమెంట్ తో సోమవారం పూడ్చి వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వార్డు సభ్యులు పాముల అనిత భాస్కర్, కోర ప్రమీలరామచందర్ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రామచంద్రయ్య ఆధ్వర్యంలో దౌల్తాబాద్ నుండి కాసాల వెళ్లి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేశారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖని కలిసిన పర్యావరణ, అటవీ శాఖ నూతన ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

**హైదరాబాద్ బ్యూరో, జూలై 06, (సిరి న్యూస్) :**

రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శైలజా రామయ్యర్ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖని హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ శైలజా రామయ్యర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శైలజా రామయ్యర్ నేతృత్వంలో అటవీ, పర్యావరణ శాఖలు మరింత ప్రభావవంతంగా పనిచేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆశయాలమేరకు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, వన మహోత్సవం, వన్యప్రాణులు, జీవవైవిధ్య పరిరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ.

## కదిలిన అధికారులు.. తొలగించిన చెత్త కుప్పలు.!..

- ప్రజల కష్టాలకు పారా పట్టిన మాజీ కార్పొరేటర్' కథనానికి స్పందన..
- సిరి తెలుగు దినపత్రిక కథనం ప్రభావంతో రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం..
- డ్రైనేజీ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన..




**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రతినిధి ( సిరి న్యూస్ ):**

కూకట్‌పల్లి నియోజకవర్గం, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను సిరి తెలుగు దినపత్రిక ప్రత్యేక కథనం ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో అధికార యంత్రాంగం కదిలింది. ఇటీవల ప్రజల కష్టాలకు పారా పట్టిన మాజీ కార్పొరేటర్.! అనే శీర్షికతో ప్రచురితమైన కథనం ప్రజల్లో విస్తృత చర్చకు దారితీయడమే కాకుండా సంబంధిత శాఖలను వెంటనే స్పందించేలా చేసింది. డ్రైనేజీ నుంచి తొలగించిన బురద, చెత్తను అక్కడే వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని సిరి తెలుగు దినపత్రిక తన కథనంలో ప్రధానంగా ప్రస్తావించింది. ఇదే సమయంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ స్వయంగా పారా పట్టుకుని బురద తొలగింపు పనుల్లో పాల్గొనడం ప్రజల్లో విశేష చర్చకు దారితీసింది. ప్రజా సమస్య కోసం ఒక మాజీ ప్రజాప్రతినిధి స్వయంగా బురదలోకి దిగి పనిచేయడం కథనానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. సిరి తెలుగు దినపత్రిక కథనం వెలువడిన అనంతరం అధికారులు వెంటనే స్పందించి ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్‌ల పరిధిలో ప్రజలకు ఇబ్బందిగా మారిన చెత్త, సిల్ట్ కుప్పలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. అనంతరం ఎంఎంసీ డీజీఎం కృష్ణమాచార్యులు, ఏఈ నవీన్‌లతో కలిసి స్థానిక నాయకులు గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, రాజు తదితరులతో డ్రైనేజీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానికులు మాట్లాడుతూ, తమ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి అధికారులను స్పందించేలా చేసిన సిరి తెలుగు దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పదవిలో లేకపోయినా ప్రజల కోసం స్వయంగా బురదలోకి దిగి పనిచేసిన మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ సేవాభావాన్ని అభినందించారు. ప్రజల గొంతుకగా నిలిచిన సిరి తెలుగు దినపత్రిక కథనం, మాజీ కార్పొరేటర్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు..






## సీసీ రోడ్ల శంకుస్థాపనకు శ్రీకారం చుట్టిన కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 06, (సిరి న్యూస్ ) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 273వ డివిజన్ నిజాంపేట్ పరిధిలోని కొలన్ నారాయణ రెడ్డి కాలనీలో రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సోమవారం ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. కాలనీలోని సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, స్థానికులు సమస్యను హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిధుల ద్వారా రూ.65 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కాలనీ వాసులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాలనీలోని పలు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించిన ఆయన, స్థానికులు సూచించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అవసరమైన అభివృద్ధి పనులను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, కోట మురళి, కొలన్ జీవన్ రెడ్డి, మౌళేశ్వర్ రావు, ఇందిరా కడియాల, రమణ రెడ్డి, చిర్ర శ్రీనివాస్ రెడ్డి, జె. నాగి రెడ్డి, కొలన్ మాణిక్ రెడ్డి, కొలన్ వెంకట్ రెడ్డి, నాగేశ్వర్ రావు, సత్యనారాయణ, శ్రీకాంత్ రెడ్డి, వర్మ రాజు, మామిడ్ల శ్రీనివాస్, గిరిధర్, సత్య ప్రసాద్, విజయ్, జైపాల్ రెడ్డి, కోటి రెడ్డి, ఉపేందర్, క్రిష్ణ రెడ్డి, కొలన్ క్రిష్ణ రెడ్డి, కైలాష్, అంజి రెడ్డి, పి. శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ తదితరులు, అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లో కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్ ప్రారంభం

**గజ్వేల్‌టౌన్,జూలై 06,(సిరిన్యూస్):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో సోమవారం కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభం. సినీ తార ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాసం ఫ్యాషన్స్ 28వ స్టోర్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్ తో నిత్య నూతన వెరైటీలతో కాసంఫ్యాషన్స్ పేరు గాంచిందని, ఈ స్టోర్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అనసూయ భరద్వాజ్ కాసం ఫ్యాషన్స్ లోని లేడీస్ జెంట్స్ కిడ్స్ వెర్ అంతా కలియతిరిగి సందడి చేసారు. గజ్వేల్ చుట్టు పక్కల ప్రాంత వాసులు షాపింగ్ కాసం ఫ్యాషన్స్ లో చేయాలని అన్నారు. కాసం షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత 5 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో 28 స్టోర్స్ ప్రారంభించాం అని అన్నారు. మా వస్త్రాలను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. అధునాతన ఫ్యాషన్ డిజైన్లను వినియోగదారులకు తక్కువ రేటుకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు. తమ సంస్థ ద్వారా గజ్వేల్ లో స్థానికులకు నిరక్ష్యరాసులవారికి ప్రభుత్వ జాబ్ అవకాశం లేని వారికి 150 మందికి ఉపాధి కల్పిస్తున్నామని, తమ వద్ద సామాన్య వ్యక్తులకు కూడా ఉపాధి గ్యారంటీ అన్నారు. తొలుత సినీనటి అనసూయ భరద్వాజ్ ను చూడడానికి ఉదయం నుండి అభిమానులు, పరిసర ప్రాంత యువతి, యువకులు బారులు తీరారు. యువతి యువకుల కేరింతలతో కాసం షాపింగ్ మాల్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లు రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, ఆర్యవైశ్య నాయకులు రుక్మయ్య, కైలాస ప్రభాకర్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి. సంతోష్, షాపింగ్ మాల్ నిర్వాహకులు పుల్లూరు అరుణ్ కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్, కాసం ఫణిత్, కాసం సాయికృష్ణ, యాంసాని ప్రవీణ్ తో పాటు పట్టణంలోని ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు బీజేపీ సంకల్ప యాత్రలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 06, ( సిరి న్యూస్ ) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం పరిధిలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన "సంకల్ప యాత్ర – గడప గడపకు బీజేపీ" కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. మహాదేవపురం చౌరస్తాలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించి, "భారత్ మాతాకీ జై", "వందే మాతరం", "జై శ్రీరామ్" నినాదాల మధ్య భారీ ర్యాలీని ప్రారంభించారు. ఈ యాత్ర మహాదేవపురం, గాజులరామారం, రామ్‌కీ ఉషోదయ కాలనీ, హెచ్ఏఎల్ కాలనీ, రోడ్ మేస్త్రీ నగర్, శ్రీరామ్ నగర్, ఎన్‌టీఆర్ నగర్, శ్రీనివాస్ నగర్ మీదుగా చంద్రగిరి నగర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడం భారతీయ జనతా పార్టీ ప్రత్యేకత అని అన్నారు. రావుల శేషగిరి చేపట్టిన ఈ యాత్ర గాజులరామారం ప్రాంతంలో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రావుల శేషగిరి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం భారతీయ జనతా పార్టీతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, రావుల శేషగిరి ప్రజాసేవను కొనియాడారు. కౌన్సిలర్‌గా, మూడు సార్లు కార్పొరేటర్‌గా, జీహెచ్ఎంసీ నాలా కమిటీ చైర్మన్‌గా, మూడు సార్లు స్టాండింగ్ కమిటీ సభ్యునిగా సేవలందించి గాజులరామారం అభివృద్ధికి విశేష కృషి చేశారని ప్రశంసించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డా. మల్లారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, జిల్లా, మండల స్థాయి నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా ప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. "సంకల్ప యాత్ర – గడప గడపకు బీజేపీ" కార్యక్రమం ద్వారా ప్రజలతో ప్రత్యక్ష అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన ఈ యాత్రకు గాజులరామారం ప్రాంతంలో విశేష స్పందన లభించింది.

## సీఎంఆర్ఎఫ్ సాయంతో పేదలకు ఊరట

### ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**మానకొండూర్ ప్రతినిధి, జూలై 06, (సిరి న్యూస్ ) :**

ఆపత్కాలంలో ఆరోగ్యం బాగాలేక ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఊరటనిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో ఆయన 26వ విడుత సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపత్కాలంలో ఎంతో ఊరటనిచ్చే పథకమని అన్నారు. వైద్య చికిత్స కోసం అప్పుల పాలవకుండా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలానికి సీఎంఆర్ఎఫ్ 26వ విడతలో 91 మందికి 26,17,000 రూపాయలు మంజూరు కాగా, వాటిని చెక్కుల రూపంలో అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు రావాలంటే నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారదర్శకంగా, సత్వరంగా చెక్కులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్ కుమార్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, కె. అంతగిరి, మామిడి రాజు, నేరెళ్ల విజయ్ గౌడ్, నవీన్ కుమార్, బొలవేణి రమేశ్, కాత మల్లేశం, మాధవరెడ్డి, వంచ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యాన్ని అందించే 'రైతు వారధి'

ఈ మధ్యకాలంలో మనం తినే ఆహార పదార్థాల్లో చాలావరకు కల్తీ అవుతున్నాయని వార్తలు వస్తున్నాయి. రోజుకో ప్రొడక్ట్ కల్తీ అని తెలుస్తోంటే.. గుండెల్లో గుబులు మొదలవుతోంది. ఎంతో ఇష్టంగా తినే ఫుడ్ కల్తీ కావడం వల్లే మన దేశంలో ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నారని నిపుణులు చెప్తున్నారు. అందుకే 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని నమ్మిన ఒక యువరైతు ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడానికి సిద్ధమయ్యాడు. తోటి రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. బీటెక్ చదివి తోటి రైతులకు సాగు పాఠాలు నేర్పుతున్న క్యాస మధు స్టోరీ ఇది.

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికేపల్లికి చెందిన మధు.. బీటెక్ అయిపోగానే కొంతకాలం ఉద్యోగం చేశాడు. తర్వాత ఉద్యోగం మానేసి తిరిగి ఇంటికి వెళ్లాడు. అప్పటి నుంచి ఆర్గానిక్ ఫార్మింగ్ గురించి రీసెర్చ్ చేశాడు. వ్యవసాయాధికారులు, రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకునేవాడు. అంతేకాకుండా యూట్యూబ్‌లో వీడియోల్లో చూసి సేంద్రియ సాగులో మెళకువలు నేర్చుకునేవాడు. అలా ఇప్పుడు తను వాళ్ల పొలంలో పూర్తిగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. తనకున్న వ్యవసాయ భూమిలో సేంద్రియ సాగు మొదలుపెట్టాడు. అలా పండిన పంటలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా కస్టమర్లకు అమ్ముతున్నాడు. అందుకోసం 'రైతు వారధి'ని ఏర్పాటు చేశాడు. దీని ద్వారా రైతులకు, కస్టమర్లకు మధ్య దూరాన్ని తగ్గిస్తున్నాడు.సేంద్రియ పద్ధతిలో పండించిన పప్పుదినుసులు, పసుపు, కూరగాయలతోపాటు కారంపొడిని అమ్ముతున్నాడు. వీటితో పాటు గానుగ నూనె, పచ్చళ్లు కూడా హోమ్ డెలివరీ చేస్తున్నాడు.

ప్రస్తుతం దాదాపు70 శాతం మంది రైతులు దొడ్డు రకం బియ్యం పండిస్తుండగా, 30 శాతం మంది మాత్రమే సన్నరకాలు పండిస్తున్నారు. కానీ, సన్న రకాలకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో కొందరు రైతులు ఎక్కువ దిగుబడి కోసం రసాయనాలు వాడుతున్నారు. అయితే, దానివల్ల అనారోగ్యాలు వస్తాయని మధు మిగతా రైతులకు అర్థమయ్యేలా వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నాడు.



### ఎలా మొదలైందంటే..

కొన్నేండ్ల నుంచి అధిక దిగుబడుల కోసం చాలామంది రైతులు విపరీతంగా రసాయనాలు వాడారు. ఇప్పటికీ వాడుతున్నారు. కానీ.. కరోనా వల్ల చాలామంది మంచిఫుడ్ తింటేనే ఆరోగ్యంగా ఉంటామని తెలుసుకున్నారు. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో పండించిన ఫుడ్ తినేందుకు ఇష్టపడుతున్నారు. కానీ.. అలాంటి ఆహార ధాన్యాలు మార్కెట్‌లో సరిగ్గా దొరకడం లేదు. కొందరు రైతులు కష్టపడి సేంద్రియ పద్ధతుల్లో పండించినా అవి కస్టమర్ వరకు చేరేలోపే కల్తీ అవుతున్నాయి. అందుకే కెమికల్స్ లేని పంటలు పండించి, వాటిని నేరుగా కస్టమర్లకు చేర్చాలి అనే ఆలోచనతో మొదలైంది మధు ప్రయాణం.

"ప్రస్తుతం జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ సర్వీస్‌లు అందిస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయంలో ఖర్చు చాలా తక్కువ. కానీ.. లాభాలు ఎక్కువగా వస్తాయి. పైగా సరైన పద్ధతుల్లో పండిస్తే దిగుబడి కూడా బాగానే వస్తోంది. సేంద్రియ ఉత్పత్తుల వల్ల రైతుతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారు" అని చెప్తున్నాడు మధు.








# ఇంగువ వల్ల ఎన్ని లాభాలో!

కొన్ని రకాల భారతీయ వంటల్లో ఇంగువ వాడడం సహజం. ముఖ్యంగా పులిహోర లాంటి వంటలకు ఇంగువ లేకపోతే రుచే లేదు. రుచితో పాటూ ఇంగువ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని తెలుసా? ఇప్పుడు తెలుసుకుందాం.

ఇంగువలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అంటువ్యాధులను నివారించడానికి ఉపయోగపడతాయి. ఏదైనా గాయం అయితే తొందరగా నయం చేయడానికి సాయపడతాయి.

ఒక అధ్యయనం ప్రకారం, ఇంగువను ఆయుర్వేద వైద్యంలో వివిధ ఆరోగ్య ప్రయోజనాల కోసం చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు కూడా. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. దీనికున్న క్షార స్వభావం వల్ల కడుపులో అసిడిటీని, యాసిడ్ రిఫ్లక్స్‌ను తగ్గిస్తుంది.

### ఆడవాళ్లకు ఇలా..

ఫేస్ ప్యాక్స్ లో చిటికెడు ఇంగువ వేసుకుని ముఖానికి రాసుకుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.ఇంగువలోని రోగ నిరోధక లక్షణాలు నెలసరి సమయంలో వచ్చే నొప్పులు, ఇతర పిఎంఎస్ లక్షణాల నుండి ఉపశమనం ఇవ్వడానికి సాయం చేస్తాయి. పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం కాకుండా కంట్రోల్ చేస్తుంది.

# ఎవర్‌గ్రీన్ కాంబినేషన్

వర్షం కురిసే వేళ... వేడిగా పొగలు కక్కుతున్న టీ ఉంటే... అద్భుతః అనిపిస్తుంది ఈ ఎవర్‌గ్రీన్ కాంబినేషన్ మాన్‌సూన్‌లో తప్పక ట్రై చేయాల్సిందే. కానీ, ఇందులో స్పెషాలిటీ ఏంటంటే... మామూలు టీ కాదు అల్లం, పుదీనా, తులసి వంటి వాటితో టీ పెట్టుకుని తాగితే.. వానాకాలంలో వేధించే దగ్గు, జలుబు, తలనొప్పి, ముక్కుదిబ్బడ, గొంతులో గరగర వంటి సమస్యలన్నింటికి చెక్ పెట్టొచ్చు. మరింకేం.. ఈ టీలు ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందామా.



### అల్లం టీ



**కావాల్సిన పదార్థాలు:**

అల్లం – ఒక టీస్పూన్
తేనె – రెండు స్పూన్లు
లవంగాలు – రెండు
దాల్చిన చెక్క – 1అంగుళం
నీళ్లు – ఒక కప్పు

**తయారీ విధానం:**

ఒక గిన్నెలో ఒక కప్పు నీళ్లు పోసి మరిగించాలి. తర్వాత అందులో అల్లం, తేనె, లవంగాలు, దాల్చిన చెక్కలను వేయాలి. ఆ నీటిని పావుగంట పాటు పక్కన పెట్టాలి. ఆపై ఒక కప్పులో టీని వడకట్టి ఈ గోరువెచ్చగా తాగాలి.

### తులసి టీ



**కావాల్సిన పదార్థాలు:**

తులసి ఆకులు – పావు కప్పు
తేనె – ఒక టీస్పూన్
నిమ్మరసం – రెండు టీస్పూన్లు
నీళ్లు – పావు కప్పు

**తయారీ విధానం:**

ఒక గిన్నెలో నీళ్లు పోసి అందులో తులసి ఆకులు వేసి మరిగించాలి. ఆ తర్వాత ఈ నీటిని ఒక కప్పులో వడకట్టాలి. ఆపై తేనె, నిమ్మరసం కలుపుకొని గోరువెచ్చగా ఉన్నప్పుడే ఆస్వాదిస్తే.. ఆ అనుభూతే వేరు.

### పుదీనా టీ



**కావాల్సిన పదార్థాలు:**

పుదీనా ఆకులు – కొన్ని
రోజ్‌మేరీ రెమ్మ – ఒకటి
నిమ్మరసం – రుచికి సరిపడా
నీళ్లు – ఒక కప్పు

**తయారీ విధానం:**

ముందుగా ఒక గిన్నెలో నీళ్లు పోసి మరించాలి. అందులో రోజ్‌మేరీ వేసి ఉడికించాలి. మరోవైపు ఒక కప్పులో పుదీనా ఆకులను వేయాలి. ఆ తర్వాత రోజ్‌మేరీ మిశ్రమాన్ని పుదీనా ఆకులు ఉన్న కప్పులో పోయాలి. పది నిమిషా అలాగే ఉంచి.. చివరగా నిమ్మరసం వేసుకుని తాగితే.. టేస్ట్ బాగుంటుంది.

# 10న లెనిన్ విడుదల




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ఎ÷-లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.



# నాగార్జున వందో సినిమాలో టబూ

నెగెటివ్ షేడ్‌లో ఉంటుంది అంటూ ప్రచారం

టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి-కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పారిపోదా మనుకున్నా..

## కీర్తి సురేష్ ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రముఖ నటి కీర్తి సురేష్ తన ప్రేమ, వివాహం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోతే ఇంటి నుంచి వెళ్లి వివాహం చేసుకోవాలని కూడా ఒక దశలో అనుకున్నానని ఆమె వెల్లడించారు. తెలుగు, తమిళ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్, హీరో రామ్ పోతినేని నటించిన 'నేను శైలజ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 'మహానటి' చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఆమె, పలువురు అగ్ర హీరోల సరసన నటించారు. దీర్ఘకాలంగా ప్రేమలో ఉన్న ఆంటోనీ తట్టిల్‌ను కీర్తి సురేష్ 2024లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. దాదాపు 15 సంవత్సరాల ప్రేమ తర్వాత వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఒక ఇంటర్వ్యూలో కీర్తి మాట్లాడుతూ, తమ ప్రేమ విషయం ఇంట్లో చెబితే పెళ్లికి అంగీకరించరేమోనని మొదట భయపడ్డామని చెప్పారు. అవసరమైతే ఇంటి నుంచి వెళ్లి పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నామని, అయితే కుటుంబ సభ్యులు తమ ప్రేమను అంగీకరించి ఘనంగా వివాహం జరిపించారని తెలిపారు. తమ పెళ్లి ఇరు కుటుంబాల సమక్షంలో ఎంతో వైభవంగా జరుగుతుందని ఊహించలేదని, అందుకే వివాహ సమయంలో తాము ఇద్దరం భావోద్వేగానికి గురయ్యామని కీర్తి సురేష్ పేర్కొన్నారు. వివాహం అనంతరం కూడా కీర్తి సురేష్ సినీ రంగంలో చురుకుగా కొనసాగుతూ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు.

# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్



## ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.